# పద్మ వ్యూహం

పద్మాపురం ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు తనను ట్రాన్స్‌ఫర్ చేసినట్లువచ్చిన ఆర్డర్‌చూచుక మురిసిపోయింది పద్మావతి. పద్మాపురం గురించి చాలా గొప్పగా విన్నది ఆమె! ఒకప్పుడు వూరూ పేరూలేకుండా వుండిన ఒకానొక పల్లెటూరు. ఈ నాడు సుమారైన పట్టణంలా మారి "పద్మాపురం" గా మారిపోయిందట! ఆమె వూహలలో పద్మాపురం అంటే మరో శాంతినికేతన్ అని! అంచేత తనకు పద్మాపురానికి ట్రాన్స్‌ఫర్ అయిందని తెలిసి ఆమె సంతోషానికి మితిలేకపోయింది. ఆరాత్రంతా హాయిగా వూహలతోనే కాలం గడిపేసింది. తనకుమాత్రం ఎవరున్నారు గనుక! తను ప్రేమించి పెళ్ళాడిన భర్త శ్రీహరి. విధి దృష్టి దోషానికి బలై పోయాడు! తను తిరిగి పెళ్ళాడాలనుకుంటే, అడ్డుచెప్పేవారు గానీ, విమర్శించేవారు గానీ ఎవరూ లేరు. అయినా ఎంచేతో తనకు పునర్వివాహం చేసుకోవాలని లేదు. ఈ వైద్యవృత్తిలో పేదలకూ, రోగ పీడితులకూ సేవచేస్తూ జీవితాంతం మనసున్న మనిషిగా బ్రతకాలన్నదే తన ధ్యేయం. తన ఆదర్శం ఆచరణలో పెట్టుకొనేందుకు "పద్మాపురం" చక్కటి ప్రదేశం!

పద్మాపుర్ం పొలిమేరవద్ద బస్సుదిగిన పద్మావతికి, పద్మారావు పంపిన రెండెడ్లబండి, ఇద్దరు పాలేళ్ళూ స్వాగతం పలికారు. సూట్‌కేసులూ, పాత్రసామానువున్న పెట్టెలూ, కొద్దిపాటి ఫర్నిచరూ, హోల్డాల్ అన్నీ తొట్టెలో జాగ్రత్తగా అమర్చి, మెత్తటి గడ్డిపై చిరుచాప సరిచేసి "ఇక కూర్చోండి డాక్టరమ్మగారూ?" అన్నాడు పాలేరు వీరన్న.

బండి జోరుగా వెళుతోంది. బండి తోలుతున్న వీరన్న, వీరన్న వెంట నడుస్తున్న పుల్లయ్య, వంతులువారీగా కబుర్లు చెబుతున్నారు.

"మీ కంటే ముందుగా ఇక్కడుండి వెళ్ళిన డాక్టరమ్మగారి దగ్గరుండే వంటమనిషీ, నౌకరూ, ఇక మీ దగ్గరుంటారమ్మగారూ! మీకెలాటి ఇబ్బందులూ వుండవు...మా అయ్యగారు...పద్దయ్యగారు...అదేలెండి పద్మారావుగారు... మీకేం కావాలన్నా చిటికెలమీద సమకూరుస్తారు అసలా మహా ప్రభువు తలుచుకోబట్టి గదా ఈ గ్రామం ఈనాడు ఇంత అందంగా, పట్టణంలా వెలిగిపోతున్నది.

వాళ్ళిద్దరూ యాసభాషలో పై భావార్థంగల కబుర్లు అనేకం దొర్లిపోతున్నాయి. గ్రామంలో బండిఅడుగెట్టగానే కనిపించేది ఎత్తైనమేడ... "పద్మనిలయం" అన్న బోర్డు. రౌండుషేప్‌లో అందంగా వున్న ఆ "పద్మనిలయం" పద్మారావుగారిదని తెలుసుకోవటానికి క్షణకాలం పట్టలేదు పద్మావతికి.

"ఈ రోజంతా మీరు మా ఇంట్లోనే వుండండి. హాస్పిటల్ కాంపౌండులోనే మీకోసం చిన్నఇల్లు కేటాయించబడివుంది. మా నౌకర్లు మీసామాన్లు అక్కడ సర్దేస్తారు. రేపు వెళుదురుగాని!" ఆదరంగా స్నేహపూర్వకంగా చిరునవ్వు నవ్వుతూ అలా చెబుతున్న పద్మారావు వేపు క్షణకాలం చూస్తూ నిల్చుండి పోయింది పద్మావతి! ఆరడుగుల పొడవూ, తగిన లావుతో హూందాగా వున్న పద్మారావులో రాజదర్పం వుట్టిపడుతోంది.

క్రొత్త డాక్టర్‌కు స్వాగతం చెప్పటానికీ, పరిచయం చేసుకోవటానికి, కాలేజి ప్రిన్సిపాల్, కాన్వెంటు ప్రిన్సిపాల్, హైస్కూలు హెడ్ మాస్టర్, ఎలిమెంటరీస్కూలు హెడ్‌మిస్ట్రెస్, టీచర్లు, లెక్చరర్స్, హాస్టల్ వార్డెన్స్ అందరూ వచ్చారు? పేరు పేరునా అందర్నీ పరిచయం చేశాడు పద్మారావు! చివరిగా అన్నాడతగాడు, "డాక్టరు పద్మావతిగారూ! నాగురించి గొప్పలు నేను చెప్పుకో దల్చుకోలేదు; కానీ ఒక విషయం మాత్రం

చెబుతాను! నా ప్రతి రక్తపుబొట్టూ, స్వేదబిందువూ, నా కష్టార్జితంలోని ప్రతి పైసా వెచ్చించి, ఈ గ్రామానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చాను. పద్మాకారంలో నిర్మించబడిన ఈ గ్రామం... నా దృష్టిలో అరవిచ్చిన ఓ పద్మం! ఇందులోని ప్రతిదళమూ, సేవానురక్తితో విచ్చుకొన్నవే! మీరూ ఈ పద్మంలోని ఓ దళంగా మారి, దీనికి మరింత వన్నె చేకూర్చ గలరని ఆశిస్తున్నాను.'' మిన్నుముట్టిన కరతాళ ధ్వనులతో పద్మావతి హృదయం కూడా శృతికలిపింది.

* * * * *

చుట్టూరా ఫెన్సింగ్‌తో చూడ ముచ్చటగా వున్న బంగళా షైప్‌లో కట్టబడిన చిన్న ఇల్లు, ఇరవై గదులతో ఉన్న హాస్పిటల్-ఇక్కడికి వచ్చిన నెల రోజులవరకూ పద్మావతికి తనో వింత లోకంలోకి, స్వర్గధామంలోనికి అడుగెట్టినట్లూ, తన డాక్టర్ డిగ్రీకేకాదు, తన జీవితానికే ఓ ధన్యత ఏర్పడి నట్లూ అనుభూతి కలిగింది. పద్మారావు దాతృత్వంతో వెలిసిన హైస్కూలు అతగాడి చలువతో ప్రారంభింపబడిన కాలేజి, ఉచిత భోజనహాస్టల్, కాన్వెంటు.... ఒకటేమిటి — పద్మారావు శ్వాసకూ ఈ సంస్థలకూ ముడి వున్నంత అనుబంధంవుంది వీటన్నిటి మధ్యా!

అప్పుడప్పుడూ వచ్చి స్వయంగా అన్ని సంగతులు విచారిస్తుం టాడు పద్మారావు. "మీరు మొగమాట పడకండి డాక్టర్! హాస్పిటల్‌కు కావలసిన పరికరాలేమిటో — అవసరమైనవన్నీ పెద్ద ఎత్తులోనే లిస్టు వేసి ఇవ్వండి- పైకి వ్రాసి గ్రాంటు తెప్పిస్తాను. అంతగా వందో, వెయ్యో తగ్గితే, నా చేతిది వేసుకుంటాను.... మానవజన్మ ఎత్తింది మానవసేవ చేయటానిగ్గాక మరెందుకండీ'' అనేవాడు.

ఇలాటి పద్మారావులు వందమందివుంటే? దేశం తిరిగి బాపూజీ బోసినవ్వులోని వెన్నెలలు పండించదూ? అనుకుంది పద్మావతి! మరునాడే

హాస్పిటల్‌కు కావలసిన మందులూ, వాష్‌బేసిన్సూ, బెడ్‌షీట్సు, కొత్త మైక్రోస్కోపు, మరికొన్ని ఆపరేషన్ థియేటర్‌లోకి అవసరమైన వస్తు సామాగ్రి లిస్టువేసి పద్మారావు కిచ్చింది.

నెల తిరిగేసరికి అవన్నీ వచ్చాయి "పద్మనిలయానికి!"

"హాస్పిటల్‌లో ఆ సామాగ్రి అంతా చక్కగా అమర్చేలాచూడు జాన్'' అంది కంపౌండర్ జాన్‌తో! ఎంచేతో అతగాణ్ణి చూస్తే పద్మావతికి లోలోపల కొంచెం జంకుగానే వుంటుంది. అతగాడెంచేతోనిర్లక్ష్యంగానూ, పొగరు మోత్తనంగానూ వున్నట్లు కనిపిస్తాడు. పద్మారావంతటి వాడు కూడా అతగాడితో మాట్లాడడానికి కొంచెం సంకోచిస్తున్నట్లు కనిపిస్తాడు....

''అలాగేనండి!'' అన్నాడేగాని మందులూ, పరికరాలూ మూడు రోజులవరకూ రాలేదు హాస్పిటలుకు.

మూడవరోజు మరలా హెచ్చరించింది పద్మావతి.

"మీరు త్వరపడకండి డాక్టర్ అన్నీ వస్తాయి''అంది సిస్టర్ శాంత నిమ్మళంగా.

భావగర్భితంగా నవ్వాడు జాన్. "పాపం! డాక్టరుగారు కొత్త-వారికిక్కడి ఆచారాలు ఇంకా వంటపట్టలేదు. నువ్వేనా చెప్పు శాంతా?" అని వెళ్ళిపోయాడు జాన్. ఆ సాయంత్రం వచ్చిన మందుల బాటిల్సు అన్నీ సీళ్ళు వూడదీయబడటమేగాదు, డైల్యూట్ చేయబడి వున్నాయి! పగిలిన వాష్‌బేసిన్స్, డొక్కుల్లామాసి, పింగాణీపూతపోయి వున్న బెడ్ పానుసూ, కోరాముతక బెడ్‌షీట్స్, పాత మైక్రోస్కోపూ చూచి నిర్ఘాంత పోయింది పద్మావతి.

"నే వ్రాసింది క్రొత్తమైక్రోస్కోప్, క్రొత్త శానిటరీవేర్ వగైరాలు అయితే ఈ వచ్చినవి.... ?" పద్మావతి ప్రశ్న ఆమె పెదవులు దాటకముందే, సిస్టర్ శాంత నవ్వింది.

"అదంతే డాక్టర్. మీరు అమాయకుల్లావున్నారు !" ఈ మూడు మాసాల్లో కొంత, పద్మావతికి చాలా సన్నిహితంగా వచ్చింది. అంచేతే అప్పుడప్పుడూ కొంచం చనువు తీసుకుంటుంది." క్రొత్త మైక్రోస్కోప్ వచ్చింది. కానీ అది ఓ ప్రైవేటులేబొరేటరీకి అమ్మి వేయబడింది. మందులు మంచివేవస్తాయి. అవన్నీ వేరే బాటిల్స్‌లో ప్రైవేటు మందులషాపులకు తరలింప బడతాయి. వాష్ బేసిన్స్ వగైరాలన్నీ, కొన్ని పద్మనిలయంలోకి మరికొన్ని వారిముఖ్య నిలయాలలోనికి వెడతాయి. సెకండ్‌హాండ్ వేర్స్ ఇక్కడికి చేరుతాయి....ఇలాటివన్నీ చెప్పుకోవటానికి అసహ్యంగానూ, వినటానికి దుర్భరంగానూ వుంటాయి కదండీ !"

శాంత ఇంకా ఏదో చెబుతూనే వుంది. కానీ పద్మావతి వినిపించుకోలేదు. ఓ విధంగా ఆమెకు వినిపించలేదేమో కూడాను....

అంత అందంగావుండే పద్మారావు....సంస్కారపూరితుడూ సేవాపరాయణుడూ అయిన పద్మారావు...ఇంత సంకుచితంగా, స్వార్థపూరితంగా ప్రవర్తిస్తాడా ? శాంత, జాన్ త్వరలో పెళ్ళాడబోతున్నారని తను విన్నది. . .బహుశా ఏదో అంతర్గత ద్వేషాలున్నాయేమో శాంత, జాన్‌లకు, పద్మారావుమీద ! ఏమో ? ఈ ఆలోచన వుండి వుండి ఆమె మనసులో ముల్లులా గుచ్చుకొంటోంది అప్పుడప్పుడూ !

ఆ రోజు సాయంత్రం ఎవరో ఆఫీసర్స్ వస్తారనీ, వారితోబాటు ప్రముఖ రాజకీయ నాయకులుకూడా ఒక రిద్దరు వస్తారనీ, పెద్దసభ జరగబోతోందనీ, వారిచేత ఓ అనాథ శరణాలయానికీ, మరో రెండు హాస్టల్ భవనాలకూ శంఖుస్థాపన చేయించే ప్రయత్నం జరుగబోతోందనీ–ఈఏర్పా

ట్లకూ, భోజనాలు వగైరాలంతటికీ అయ్యే ఖర్చంతా పద్మారావొక్కడే భరించబోతున్నాడనీ తెలిసిన పద్మావతి మనసంతా దోలాందోళితమై పోయింది! ఇంతటి దాతృత్వం కలిగివున్న పద్మారావు గురించి శాంత ఎందుకంత తక్కువగా మాట్లాడుతుంది? జాన్ ఎందుకంత నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తాడు! ఆ సాయంత్రం అనుకున్న ప్రకారం ఆఫీసర్స్ చాలా మంది, ప్రముఖ రాజకీయ నాయకులు కొందరు, వారి పరివారమూ, జీపులనిండా వచ్చి దిగారు. పద్మాపురమంతా, పెళ్ళిల్లులా ఏమూల చూసినా సందడిగా వుంది! బ్రహ్మాండమైన సభ జరిగింది. పద్మారావు సేవా పరాయణత గురించి వాళ్ళంతా వేనోళ్ళ శ్లాఘించారు. క్రొత్త బిల్డింగ్స్‌కూ, అనాధ శరణాలయానికి గ్రాంటూ, వాగ్దానము తీసుకున్నాడు పద్మారావు వారినుంచి. మరో నెల రోజుల్లో వర్క్ ప్రారంభించ మని ఆర్డర్‌కూడా పుచ్చుకున్నాడు అప్పుడే.

మరునాడు ఉదయం అందరూ వెళ్ళిపోయారు. పరిపరివిధాల ఆలోచిస్తూ, హాస్పిటల్‌లో అడుగు పెట్టిన పద్మావతికి వెర్రికేకలూ, ఏడుపులూ వినిపించాయి వార్డులోనుంచి! గాభరాగా లోపలికి వెళ్ళి "ఏమిటి మేరీ!" అంది సిస్టరుతో!

నలుగురు సిస్టర్స్, ఇద్దరు ఆయాలూ, జాన్, శాంత అందరూకలిసి ఓ అమ్మాయిని బలవంతంగా బెడ్‌మీద పడుకోబెట్టడానికి నానా హైరాన పడుతున్నారు! చక్కగా సన్నగా మెరుపు తీవెలావున్న ఆ అమ్మాయి వెర్రి కేకలు పెడ్తూ అందర్నీ, కాళ్ళతో చేతుల్తో కొడ్తూ రభస చేస్తోంది! ఓ వృద్ధురాలు శోకాలు పెడ్తోంది క్రిందపడి దొర్లుతూ!

డాక్టర్ రావటంతో, ఆమెకు త్రోవ ఇచ్చారు సిస్టర్స్.

"ఏమిటి!" అంది పద్మావతి మళ్ళీ.

అప్పటికా అమ్మాయి సొమ్మసిల్లినట్లు పడిపోయింది బెడ్‌మీద.

"రేప్‌కేస్... భయంతో మతి చలించినట్లుంది!" మేరీ గొణిగింది.

మిగతా ఆయాలూ, జాన్, అంతా ఆ వృద్ధురాలిని ఓదార్చుతూ బయటకు తీసికెళ్లారు. శాంత, మేరీ, పద్మావతి మిగిలిపోయారు రూంలో. మేరీ కళ్ళెందుకో ఏకధారగా వర్షిస్తున్నాయి. పేషెంటును పరీక్షించిన పద్మావతి మనస్సు వికలమైపోయింది. ఎంత దారుణమైన ...అమానుష మైన రేప్‌కేస్! భగవాన్! జీవితంమీద ఎన్ని ఆశలతో, ఎంత తియ్యటి వూహలతో యౌవ్వన ప్రాంగణంలో అడుగెట్టిందో ఈ చిన్న పూవు? ఎంత క్రూరంగా త్రుంచివేశారు? ఆ దుర్మార్గులెవరో....వాళ్లు మనుషులు కారు రాక్షసులు కూడా కారు....వారిని మించిన వీరులు.... "ఎవరీ అమ్మాయ్!" ముఖానికి పట్టిన చెమట టవల్‌తో తుడుచు కుంటూ అడిగింది పద్మావతి మేరీకేసి సాలోచనగా చూస్తూ.

"వాడు....వాడు.... ఆ పద్దిగాడు.... నా భూమంతా కాజేశాడు.... నా కూతుర్ని పొట్టన బెట్టుకున్నాడు.... ఆఖరుకు నా మనవరాలిని .... దాన్నికూడా చంపేశాడు!'' ఏడుస్తూ లోపలకు దూసుకు వచ్చిన ఆ వృద్ధురాలి కళ్ళలోంచి రాలుతున్నవి కన్నీళ్ళుగా తోచలేదు పద్మావతికి. రక్తమూ నిప్పులూ కలిసిన బిందువుల్లా కనిపించాయి. "పద్మారావు ఇంతటి ఘోరాని కొడిగట్టాడా!" తిరిగి మేరీనే ప్రశ్నించింది పద్మావతి.

మేరీ నిర్లిప్తంగా నవ్వింది. "పద్మారావు కాదు! రాత్రి వచ్చిన ఆఫీసర్లలో కొందరికి ఆహారంగా వేయబడిందీ సుబ్బులు! ఇక్కడున్న హైస్కూల్లో ఉచితంగా చదువు కొంటోంది. హాస్టల్‌లో ఉచితంగా భోజనం పెడతారు....పద్మారావుగారి దాతృత్వంలో ఇలాటి చాలా మంది కన్యలున్నారు. ఈ అభేద్యమైన కోటలోకివచ్చిన చాలామంది ఆఫీసర్లకూ, వివిధ రాజకీయ నాయకులకూ బయటి ప్రపంచంలో స్వేచ్ఛగా తమ బలహీనతల్ని తృప్తి పరచుకొనే అవకాశం వుండదు! పైగా తాము పెద్ద

మనుషులుగా చలామణీ కావాలనే కీర్తి కండూతి వారి చుట్టూరా గిరిగీయబడి వుంటుంది! అలాటివారికి దుర్భేధ్యమైన కోట ఓ చక్కని రక్షణ! వారందరికీ పద్మారావు కోరినంత మధువూ, కావలసినంత మంది ఆడపిల్లల్ని సప్లై చేస్తాడు...అంతే ఇక వారిలో అణచబడి వున్న బలహీనతలూ, రాక్షస ప్రవృత్తులూ అన్నీ ఇక్కడ పురివిప్పుకుంటాయి. ఫలితం నాలాటి, శాంతలాటి, సుబ్బులులాటి, ఎందరో కన్యలు ఇలా బలిచేయబడుతుంటారు .... ఇది సాగుతున్న చరిత్ర.... దీనికి ఫుల్‌స్టాప్ అన్నది ఎక్కడో ఎప్పుడో నాకు తెలియదు . . . పాపం అమాయకురాలు సుబ్బులు . . . భయంతో మతి పోగొట్టుకుంది . . .!" మేరీ వెక్కి వెక్కి ఏడవసాగింది . . . శాంత ముఖం తిప్పుకుంది. పద్మావతి తల గిర్రున తిరగసాగింది . . .

"మరి మీరెందుకు రిపోర్టు చేయకూడదు?" అంది ఆవేశంగా, బిగుసుకుపోతున్న పెదవులు నాలుకతో తడిచేసుకుంటూ!

శాంత పకపక నవ్వింది . . .

"ఎవరికి రిపోర్టు చెయ్యమంటారు? నిన్న చూశారుగా? ఆ వచ్చిన ఆఫీసర్లు-రాజకీయనాయకులూ-పద్మారావుగారి విందులు చవిచూశారు . . . ఆయన సేవాపరాయణతను చరిత్రలో సువర్ణాక్షరాలలో వ్రాసేస్తారు! ఆయనగారి పేరు చరిత్రపుటల్లో సుస్థిరంచేసే ఏర్పాటు చేశారు . . . ఇక అలాటివారికి, పద్మారావుగారిపై రిపోర్టు యిచ్చి, మేం సాధించేదేమిటి?

"మీకు తెలీదు డాక్టర్! పద్మారావుగారి పలుకుబడి, ఆయనగారి తెలివితేటలు! ఈ పద్మాపురం ఓ అబేధ్యమైన కోట, పోస్ట్‌మాస్టర్, పోస్టురన్నర్, . . . ఒకరేమిటి పద్మాకారంలోవున్న ఈ గ్రామంలోని, ప్రతిరేకులోని ప్రత్యణువూ ఆయనగారి గుప్పిటలో వుంది . . . తనకు

వ్యతిరేకంగా రిపోర్టు తయారైనట్లు తెలియగానే, అది పోస్టులో పైకి వెళ్ళకుండా కట్టుదిట్టం చేస్తాడు పద్మారావు. అథవా వెళ్ళినా పైవారంతా ఆయనగారి "విందులు" మజాలు మరగినవారు కావటంవల్ల – ఆ రిపోర్టు బుట్టదాఖలా అవుతుంది. ఫలితం, రిపోర్టు చేసినవారు సాలెగూటిలో చిక్కుకున్న పురుగుల్లా పద్మారావుగారి పాదాలక్రింద నలిగి నాశనమై పోతారు." శాంత చివాలున వెళ్ళిపోయింది కన్నీళ్ళు ఆపుకుంటూ.

ఎవరి డ్యూటీల్లోకి వారు వెళ్ళిపోయాడు ... పద్మావతి రక్తం గడ్డకట్టుకు పోయినట్లయింది!

సుబ్బులు వుండి వుండి పలవరిస్తోంది, మధ్య మధ్య "కోమా"లో వుంటోంది. ఆ సాయంత్రం పద్మారావు వెంట ఇరవైమంది బలగంతో హాస్పిటల్‌కు వచ్చాడు ...

"డాక్టర్ ఎంత ఘోరం జరిగిందండీ! ఈ పసిబిడ్డను నాశనం చేసిన వాళ్ళెవరో అంతు తేలుస్తాను ... కానీ మీ శాయశక్తులా ప్రయత్నించండి. అవసరమైన మందులన్నీ వాడండి. ఏవైనా కావలిస్తే, నాకారులో, నామనుషుల్ని పంపి తెప్పిస్తాను. వ్రాసి ఇవ్వండి. డబ్బుకు వెనుకాడొద్దు. వైద్యలోపం రానివ్వవద్దు. ఈ సంస్థలూ, ఇందులోని పిల్లలూ ... ఈ పద్మంలోని దళాలని మీరు మర్చిపోకండి!" అన్నాడు ఖద్దరు కండువాతో కన్నీళ్ళు తుడుచుకుంటూ!

ఆ సమయంలో పద్మారావును అలా చూస్తుంటే, దావానలంలోని అందమైన నీలిరంగు గుర్తుకు వచ్చింది పద్మావతికి!

ఆ రాత్రి అలా పలవరిస్తూనే మరణించింది సుబ్బులు!

మరునాడు సుబ్బులు మరణానికి సంతాపసూచకంగా సభ జరిగింది. అన్ని సంస్థలూ మూసివేయబడ్డాయి. పద్మారావు అధ్యక్షత వహించాడు. సభికు లందరూ రెండు నిమిషాలు మౌనం పాటించారు!

"సుబ్బులు జీవితాన్ని బలికొన్న ఆ దుర్మార్గులను భగవంతుడు ఏనాటికీ క్షమించడు. వారెవరో ఆచూకీ తీసి, వారిని కఠిన శిక్షలపాలు చేసేంతవరకూ నాకు నిద్రపట్టదు. . ." అని వాపోయాడు పద్మారావు.

సుబ్బులు అమ్మమ్మకు ఐదువందల రూపాయలు "విరాళం"గా ఇచ్చాడు. . . సభలో ఆక్రోశంగా అరుస్తూ, ఏడుస్తూ ప్రవేశించిన ఆ వృద్ధురాలిని జాగ్రత్తగా బయటికి పంపి వేశారు పద్మారావు నౌకర్లు. "పాపం! మనవరాలి మరణంతో మతి చలించింది! నిజానికి మంచి వాళ్ళకే మతి చలించే సంఘటన?" అంటూ సభ చాలించాడు. . .

ఆరోజు రాత్రి పక్కమీదపడుకున్న పద్మావతికి నిద్రపట్టలేదు. చనిపోయిన సుబ్బులూ. . .దారుణంగా హింసించబడిన. . . ఆఅమ్మాయి వెర్రికేకలూ. . . పిచ్చి చూపులూ . . . శాంత, మేరీల మాటలూ చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి వుండి. . .వుండి. . .సాయంత్రం తనూ, మేరీ అలా షికారుగా చెరువుగట్టుకు వెళ్ళారు, మనస్సు బావుండక.

ఎత్తుగా వున్న చెరువుగట్టు మీద కూర్చున్నారిద్దరూ. సాయం సంధ్యలో దూరాన కనిపిస్తున్న ఊరంతా వలయాకారంలో అందమైన ఎర్ర తామరపూవులా కనిపిస్తోంది. కాలేజి, కాన్వెంటు, హాస్పిటల్, క్రొత్తగా కడుతున్న అనాధ శరణాలయ భవనం. . . అన్నీ పద్మంలోని రేకుల్లా అందమైన డిజైన్స్‌లో కనిపిస్తున్నాయి. . .

"మేరీ! ఏమిటిదంతా? నాకేమిటో అయోమయంగా వుంది!" అంది తను దిగులుగా.

". . . అవును . . . మనసున్న ఎవరికేనా అలాగే వుంటుంది డాక్టర్! మనసూ శరీరమూ చచ్చి జీవచ్ఛవాల్లా మారిపోయిన మాకు మాత్రం మామూలయిపోయింది ఇదంతా!" మేరీ కళ్ళల్లో బాధ, నిస్సహాయత, కోపం జుగుప్స కలగాపులగంగా మిలమిల లాడిపోతున్నాయి!

"అలా చూడండి డాక్టర్! ఆ పద్మాన్ని ... ఈ పద్మపురాన్ని చూడండి. దీనిక్రింద ఎంత మకిలి ఎంత బురదవుందో గమనించండి ... ఆ పద్మాన్ని అందుకోవాలని కాలుపెట్టిన ప్రతి ఒక్కరూ ఆ బురదలో, ఆ ఊబిలో కూరుకుపోక తప్పదు ...

"మీకు తెలీదు డాక్టర్ ... కానీ ఇక్కడ పుట్టి పెరిగిన నాకు తెలుసు. ఈ పద్మాపురం ... పద్మారావు ... పద్మానిలయం ... అసలు స్వరూపం!

"నాలుగెకరాల మెట్టమాత్రం వున్న పద్దయ్య—పద్మారావుగా మారి పోయాక, ఎన్నెన్ని పనులు చేశాడు? ఎందరో విద్యార్థులకూ, విద్యార్థిను లకూ స్కాలర్‌షిప్పులు ఇప్పించి - అందులో సగంవంతు మాత్రం ఆ పిల్లలకిచ్చి - మిగతాది "పద్మనిలయం" పునాదులకు సరిపోయిందనేది ఎవరికి తెలుసు? తెలిసినా ఏం చేయగలరు? ఎన్నో గ్రాంట్లు విద్యా సంస్థల బిల్డింగ్స్‌కని సంపాదించి—ఇంజనీరింగ్ ఆఫీసర్స్‌ను కొందరిని సుబ్బులులాంటి ఎరలతో సంతృప్తిపరచి ... మిగిలిన లాభాలతో "పద్మనిలయం" అందంగా రూపొందించాడనేది. ఆ గెస్టుహౌస్‌లలో బలియైన నాబోటి కొందరు కన్యలకు మాత్రమే తెలుసు!

"ఎవరేనా గొప్పవారు తనిఖీగా వచ్చినప్పుడు మాత్రం హాస్టల్ పిల్లలకు సరైన భోజనం అమరుతుందనీ, మిగతా రోజుల్లో నూకలగంజి లాంటి అన్నం, పులుసనబడే నీళ్ళు, కొలత పాత్రలలో మాత్రమే ఇవ్వ బడతాయని నిజం వ్రాసేదెవరు! వ్రాసినా నమ్మేదెవరు? నమ్మినా తగిన చర్య తీసుకొనేదెవరు?

"ఊరంతా పద్మాకారంలో రూపొందేలా చేయించాడు. ఈ సంస్థలూ, ఈ వ్యక్తులూ అన్నీ పద్మంలోని దళాలంటాడు పద్మారావు.

నాలుగెకరాల మెట్ట ఈనాడు నాలుగువందల ఎకరాలుగా పెరిగింది? "ఉమ్మడి వ్యవసాయం" పేరుతో సుబ్బులు అమ్మమ్మలాటి ఎందరి పటా భూములో తన సాగుక్రిందకు తెచ్చుకుని, మంచిగా బుజ్జగించి, కొత్త కొత్త రకాల పంటలూ, అందుకు మళ్ళీ ప్రభుత్వ ఋణాలూ, సౌకర్యాలూ, గ్రాంటులూ పొందుతూ... విరాట్రూపం ధరించిన – పద్మారావుగారి విశ్వరూపం మాకు తెలుసు!

"ఈ పద్మాపురంలోని ప్రత్యణువూ పద్మారావు కాళ్ళకింద ధూళిగా మారిపోయిందీనాడు! ఆ ధూళికణాలన్నిటినీ "దళాలు" అంటాడు పద్మారావు. ఆ దళాలన్నీ ఈ పద్మంయొక్క కాండాన్ని అంటిపెట్టుకుని వుండక తప్పదు.... రాలిపోతే వాడిపోవాల్సిందే? అంచేత అన్నీ తెలిసీ, ఏమీ తెలియనట్లు యోగులలా మసులుకోవటం నేర్చుకొన్నాం.... !"

ఆవేశంగా మరీ ఇంకా ఎన్నెన్నో చెప్పింది .... ఇది .... పద్మవ్యూహం....! చిన్నప్పుడు "అభిమన్యుడి వధ" కథ చెబుతూ బామ్మ ముగ్గుతో "పద్మవ్యూహం" బొమ్మ వేసి చూపింది తనకు.... అది సరిగ్గా ఇలాగే ... ఈ పద్మవ్యూహంలానే వున్నట్లు ఇప్పుడనిపిస్తోంది! ఆనాడు ఆపద్మవ్యూహంలో అడుగెట్టిన అభిమన్యుడు బయటికి వచ్చేదారితెలియక చనిపోయాడు .... ఈనాడు పద్మాపురమనే పద్మవ్యూహంలో చిక్కడిపోయిన-తను....? తనే మౌతుంది?

* * * * *

సన్నగా తలుపుచప్పుడు—తృళ్ళిపడి లేచి కూర్చుంది పద్మావతి. ఆలోచనలన్నీ ఎక్కడివక్కడ ఎగిరిపోయాయి. ఈ రాత్రప్పుడు ఎవరు వచ్చారు? నౌకరూ, పనిమనిషీ, పద్మారావు కబురుపై సాయంత్రమనగా వెళ్ళారు. ఇందాకా రాలేదు....

పద్మావతిగుండె గడగడలాడటం మొదలెట్టింది.... మెల్లగా ధైర్యం చిక్కబట్టుక తలుపు తీసింది. "ఎవరూ?" అంటూ! ఎదురుగావచ్చి నిల్చుని వున్న వ్యక్తినిచూచి నిర్ఘాంత పోయింది!

పద్మారావు మత్తుగా, ఎర్రగా....అగ్నిలాటి, ఆకలిగొన్న చూపులతో....నిల్చుని వున్నాడు...

ఆపాదమస్తకం కంపించి పోయింది పద్మావతి "మీరు. . .మీరు . . ." మరిమాటలు పెగ్గలేదు.

"నేనే! కంగారుపడకు, భయం లేదు." బహుశా మోతాదు మించలేదేమో, మాట స్ఫుటంగానే వస్తోంది.

". . .నా పేరు పద్మారావు. . . నీ పేరు పద్మావతి . . . మన ఈ కోటపేరు పద్మాపురం. . .? ఈ పద్మవ్యూహానికి. . . సారీ. . . ఈ పద్మ నగరానికి. . .నిన్ను రాణిని చేస్తాను. ఈ కోటదాటి ఈ రహస్యం బయటకి వెళ్ళదు. వెళ్ళినా ఫర్వాలేదు. . . నువ్వు విధవవు. . .నేను వివాహితుడినే అనుకో....అది....నా భార్య... పద్మజ....జబ్బుతో తీసుకొంటోంది .... బహుశా త్వరలోనే చస్తుంది .... అదికాగానే నిన్ను పదిమంది ఎదుటా పెళ్ళాడేస్తాను....మన ఆదర్శవివాహం పత్రికలన్నిటిలో ప్రముఖ వార్తగా వేయిస్తాను .... "పద్మనిలయం" నీ చేతుల్లో పెడతాను .... బెదరకు .... సిరీ, కీర్తి, అయాచితంగా లభిస్తుంటే మోకాలడ్డకు .... నువ్వు నన్ను కాదని .... ఇక్కడ వుండలేవు .... బయటికి వెళ్ళలేవు .... ఆలోచించుకో.... !"

అతగాడి చేతులు కబంధుడి హస్తాల్లా పెరుగుతున్నట్లు తోచిన పద్మావతి కెవ్వున అరిచింది. దగ్గరలో ఎవరివో అడుగుల సవ్వడి .... క్షణకాలం వెనక్కు తగ్గాడు పద్మారావు.

"ఈ క్షణమేదో గాభరా పడ్తున్నావ్, బాగా ఆలోచించుకో .... భయం వదిలాక కబురు చెయ్యి.."

"ముందు మీరు వెళ్ళండి".... ఏడుస్తూ అరిచింది పద్మావతి ....

పద్మారావు వెళ్ళిపోయాడు. అంత త్వరగా అతగాడు వెళతాడని వూహించుకోలేదామె ! కుప్పగా, కూలబడి, నిస్సహాయంగా, మోకాళ్ళ మీద తలపెట్టుకు ఏడుస్తూ కూర్చుండిపోయింది !

తలమీద చెయ్యివేసి మృదువుగా రాస్తున్న చల్లని స్పర్శతో, కళ్ళెత్తి చూచిన పద్మావతి ఆశ్చర్యపోయింది.

కాంపౌండర్ జాన్, అతగాడి వెనకాలే శాంత.

"తమ్ముడూ!" వెక్కిళ్ళతో మరిమాట పెగల్లేదు.

"ఏడవకు ! ఈ సమయంలో నువ్వు డాక్టరువుకావు. నేను కాంపౌండర్‌నూ కాను .... నా సోదరివి నువ్వు ! నీ తమ్ముణ్ణి నేను ! ఎన్ని ఘోరాలో ఈ కళ్ళతో చూశాను. ఎందరు నీలాటి సోదరిల బాధో గుండె మండిపోతూ వహించాను. భయంలేదు. నేను నిన్ను ఈ పద్మ వ్యూహంలోనుంచి బయటకు నడిపిస్తాను .... పద్మారావు నన్నేమీ చెయ్య లేడు. కారణం శాంతకు అతగాడు చేసిన ఘోరానికి ఏనాడో ఓనాడు నేను ప్రతీకారం చేస్తానన్న భయం అతగాడి అంతరాంతరాలలో బలంగా వుందని నాకు తెలుసు. నన్ను వదిలించుకొనే మార్గంకోసం అన్వేషిస్తు న్నాడు .... పద .... నిన్ను సురక్షితంగా బయటికి పంపుతాను. నీ సామాను తర్వాత పంపిస్తాను .... నేనూ శాంతా వివాహం చేసుకుంటాం త్వరలోనే .... అందరం మరోచోట కలుద్దాం .... ఈ పాప పంకిలంలో నీలాటి అమాయకులు వుండటం .... మంచిదికాదు .... లే... కళ్లు తుడుచుకో !"

నిర్లక్ష్యంగా .... క్రూరంగా కనిపించే జాన్ కళ్ళల్లో నిజమైన మానవత్వపు నీడలు చూచిన పద్మావతి నిశ్చితంగా లేచి నిల్చుంది ....

*    *    *    *

ఇది జరిగిన ఆరేళ్ళ తర్వాత ఆరోజు హాస్పిటల్‌కు వెళ్ళబోతూ అలవాటు ప్రకారం టేబుల్‌మీదున్న బాపూజీ దంతపు బొమ్మదగ్గర క్షణకాలం నిమీలిత నేత్రాలతో నిల్చుంది పద్మావతి.

డ్యూటీకి వెళ్ళబోతున్న శాంత, పేపరు పట్టుక విరగబడి నవ్వుతూ వచ్చింది.

"ఇది చూశారా డాక్టర్? పద్మారావుగారికి .... వారి సేవాపరాయణతకూ – మానవ సేవకూ .... గుర్తింపుగా....ప్రభుత్వంవారు బిరుదు ప్రదానం చేశారుట! త్వరలో పద్మాపురంలోనూ, ఇతర పెద్ద పట్టణాల్లోనూ ఆయనగారికి సన్మాన సభలు జరుగుతాయట!".... పొట్ట చేత్తో పట్టుకుని పడీ పడీ నవ్వుతోంది శాంత! అది నవ్వులా ధ్వనించటం లేదు .... దేశమాత వెక్కిళ్ళుపెట్టి ఏడుస్తున్నట్లు ధ్వనించింది పద్మావతికి. పేపర్లోకి చూచింది .... పద్మారావు ఫుల్‌సైజు ఫొటో....ఆ అందమైన కళ్లు నవ్వుతున్నాయి. ఆ చక్కటి పెదవులు అమాయకత వెదజల్లుతున్నాయి. ఆ నిండైన విగ్రహం అణువణువునా సేవాపరాయణతే రూపుదాల్చినట్లుంది . . .

పద్మావతికి నవ్వు రాలేదు. బాధకలుగలేదు. ఆశ్చర్యం అసలే కలుగలేదు. బాపూజీ దంతం బొమ్మకేసి దృష్టి మరల్చుకుంది. ఆమె మనసు మూగగా అర్థించింది.

"బాపూ! మళ్ళీ నీవు మా దగ్గరకు ఒక్కసారి రావూ"

("ప్రగతి" 2-5-'69)